నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, గురువారం 2 మే 2024 | YADADRI BHUVANAGIRI

# రుణమాఫీ ఆగస్టు 15నే ఎందుకు?

## అప్పటి వరకు అన్ని ఎన్నికలు పూర్తవుతాయి

- ఆ తర్వాత చేతులెత్తెయ్యడమే కాంగ్రెస్ ప్లాన్
- గాలి ముచ్చట్లతోనే హస్తం పార్టీ పరిపాలన
- ఎన్నికల్లో గెలిస్తే ప్రజల మద్దతు అని విర్రవీగుతరు
- బీఆర్ఎస్ గెలిస్తేనే హామీలు ముందుకు..
- క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్య గౌడ్



బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్య గౌడ్

యాదాద్రి భువనగిరి, మే 1 (నమస్తే తెలంగాణ) : 'రుణమాఫీకి సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు ఆగస్టు 15వ తేదీని డెడ్ లైన్‌గా పెట్టారు. అప్పటి దాకా సమయం ఎందుకు..? ఎన్నికలు పూర్తయిన వెంటనే రుణ మాఫీ చేయకపోవడం ఏంటి..? ఆగస్టు వరకు కాలయాపన చేస్తే.. వరుసగా వచ్చే ఎన్నికలను దాటవేయొచ్చు. ఆ తర్వాత రుణమాఫీ చేయ కుండా చేతులెత్తేయడమే కాంగ్రెస్ ప్లాన్ ' అని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్య గౌడ్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీఆఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు నెలల్లోనే పరిపాలనలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కరువుతో అల్లాడుతున్నా కనీసం పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు డబ్బులు జమ చేయలేదని, రూ. 500 బోనస్ పత్తాలేదని మండిపడ్డారు. వారాలు గడుస్తున్నా కల్లాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

### ప్రజల నుంచి కాంగ్రెస్‌కు వ్యతిరేకత

అసెంబ్లీ ఎన్నికల ముందు అడ్డగోలుగా 420 హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని భిక్షమయ్య గౌడ్ ధ్వజమెత్తారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ప్రగల్భాలు పలికి.. ఇప్పుడు గాలి ముచ్చట్లు చెబుతూ కాలం వెల్లదీస్తున్నదని విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500, పింఛన్ల పెంపు, ఆడబిడ్డల పెండ్లికి తులం బంగారం, రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు ఏమయ్యాయని ప్రశ్నించారు. మూడు నెలల్లోనే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేశామా అని బాధపడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో నీటి కష్టాలు మొదలయ్యాయని, మళ్లీ బిందెలు పట్టుకుని ట్యాంకర్ల వద్ద నీళ్లు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

### బీఆర్ఎస్ గెలిస్తేనే హామీలు అమలు..

ఎంపీ ఎన్నికలు రెఫరెండమని కాంగ్రెస్ అంటున్నదని, ఒక వేళ గెలిస్తే.. పథకాలు అమలు చేయకున్నా ప్రజలు తమకు బ్రహ్మరథం పట్టారని విర్రవీగుతుందని భిక్షమయ్య గౌడ్ అన్నారు. ఆ తర్వాత ఆరు గ్యారెంటీలు, హామీలను అటకెక్కిస్తారని చెప్పారు. హామీలు అమలు కావాలంటే కాంగ్రెస్‌కు కార్రు కాల్చి వాత పెట్టాలని, బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. అప్పుడే ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ గతంలో ఎంపీగా గెలిచినా భువనగిరికి ఏం చేయలేదని, బీజేపీ రాష్ట్రానికి చేసిందేమీ లేదని చెప్పారు. మళ్లీ గెలిపించినా చేసేదీ ఏమీ ఉండదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు ప్రజలు అడుగడుగునా నీరాజనం పలుకుతున్నారని చెప్పారు. బీసీ బిడ్డ క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



రోడ్ షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి , పక్కన ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ నేత చెరుకు సుధాకర్

# కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదు

అమలుకాని హామీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్

## నిషేధాలు పెట్టినా ప్రజల నుంచి కేసీఆర్‌ను విడదీయ లేరు

- జైళ్లు, కేసులు బీఆర్ఎస్ పార్టీకి కొత్తేమీ కాదు
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- రామన్నపేటలో బీఆర్ఎస్ రోడ్ షో.. పెద్ద ఎత్తున హాజరైన జనం
- క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపు

రామన్నపేట, మే 1 : కేసీఆర్‌పై ఎన్ని నిషేధాలు విధించినా ఆయనను ప్రజల నుంచి విడదీయలేరని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ రోడ్ షోలో భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అమలు చేయలేని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి గుణపాఠం చెబుతారని అన్నారు. కేసీఆర్‌పై ప్రజల్లో విశ్వాసం ఉందని, భువనగిరి పార్లమెంట్ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుదని ధీమా వ్యక్తం చేశారు. జైళ్లు, కేసులు బీఆర్ఎస్‌కు కొత్తేమీ కాదని, ప్రజల పక్షాన కొట్లాడుతాం, పోరాడుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని నాశనం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో రైతన్నలు, ప్రజలు కరువుతో అల్లాడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందన్నారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ బడుగు, బలహీన వర్గాలకు ఆరు పార్లమెంట్ స్థానాలు కేటాయించిదని, సమన్యాయం బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. దేశంలో 40 కోట్ల మంది తిండి, బట్టలు లేక, 25 శాతం గ్రామాల్లో కరెంట్, రోడ్లు, విద్య లేక బాధపడుతుంటే బీజేపీ ప్రభుత్వం శ్రీరాముడు, పుల్వామా దాడులు అంటూ దేశాన్ని నాశనం చేస్తుందన్నారు. బడుగు వర్గాల బిడ్డనైన తనను గెలిపిస్తే మీ సేవకుడిగా పని చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో గద్దెనెక్కి రైతులు, ప్రజలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుబంధు 5 ఎకరాలకే పరిమితం చేశారని, సౌభాగ్యలక్ష్మి, తులం బంగారం, విద్యార్థులకు స్కూటీలు అన్నారే తప్ప అమలు చేశారా? అని ప్రశ్నించారు. ప్రతి కార్యకర్త కష్టపడి పని చేసి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకుడు చెరుకు సుధాకర్, మాజీ ఎంపీపీ కన్నెబోయిన జ్యోతీబలరాం, పార్టీ మండల కార్యదర్శి పోశబోయిన మల్లేశం, కంభంపాటి శ్రీనివాస్, బొక్క మాధవరెడ్డి, బందెల రాములు, ఎడ్ల మహేందర్‌రెడ్డి, అంతటి రమేశ్, ముక్కామల దుర్గయ్య, గొరిగె నర్సింహ, కాల్య శ్రవణ్‌కుమార్, మెట్టు మహేందర్‌రెడ్డి, బద్దుల రమేశ్, బత్తుల వెంకటేశం, పోతరాజు సాయి, జాడ సంతోష్, మిర్యాల మల్లేశం, బండ శ్రీనివాస్‌రెడ్డి, కూనూరు ముత్తయ్య పాల్గొన్నారు.



రామన్నపేటలో రోడ్ షోకు పెద్ద ఎత్తున హాజరైన ప్రజలు

# ఈవీఎంల పనితీరుపై అవగాహన కలిగి ఉండాలి

- పీఓ, ఏపీఓల శిక్షణలో కలెక్టర్ హనుమంతు జెండగే



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు జెండగే

భువనగిరికలెక్టరేట్, మే 1 : పోలింగ్ విధులు, ఈవీఎంల పని తీరుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు సూచించారు. భువనగిరి పట్టణ పరిధిలోని రాయగిరి విద్యాజ్యోతి హైస్కూల్‌లో బుధవారం రెండో విడుత శిక్షణకు ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలో పోలింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలకు కలిపి మొత్తం 1,336 మంది ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు రెండో విడుత శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలింగ్ ముందు రోజు చెక్ లిస్ట్ ప్రకారం మెటీరియల్ తీసుకోవాలని, ఈవీఎంలను పరీక్షించుకోవాలని, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను పోలింగ్ కేంద్రాల్లో అమర్చుకోవాలని, మాక్ పోలింగ్‌పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. హ్యాండ్ బుక్‌లో సూచించిన విధంగా మొత్తం పోలింగ్ సామగ్రిని సేకరించుకోవాలన్నారు. పోలింగ్‌కు ముందు ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్ నిర్వహించాలని, పోలింగ్ ఏజెంట్లు అందరూ వచ్చే లాగా ముందు రోజే వారికి తెలియజేయాలని చెప్పారు. పోలింగ్ స్టేషన్ ప్రాంతం, ఓటర్ల వివరాలు తెలిపే నోటీసు బోర్డులు, ఫారం -7లో పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను పోలింగ్ స్టేషన్ బయట ప్రదర్శించాలని తెలిపారు. పోలింగ్ పూర్తయిన తర్వాత కంట్రోల్ యూనిట్‌లో క్లోజ్ బటన్ పోలింగ్‌ను ఏజెంట్ల ముందు చేసి డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి, జిల్లా విద్యా శాఖ అధికారి కే. నారాయణ్‌రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి పాల్గొన్నారు.

# తనిఖీల్లో రూ.3.59 లక్షలు స్వాధీనం : డీసీపీ రాజేశ్‌చంద్ర

భువనగిరి అర్బన్, మే 1 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆధారాలు లేకుండా నగదుతో పాటు మద్యం ఇతర వస్తువుల రవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి మే 1వరకు జిల్లా వ్యాప్తంగా రూ.3,59,500, 89.07 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని, 23 మందిని బైండోవర్ చేశామని డీసీపీ రాజేశ్‌చంద్ర తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని, రూ. 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే ఆధారాలు చూపించాలని పేర్కొన్నారు. అక్రమంగా మద్యం, ఇతర ఏవైనా సామగ్రి తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# రేపు నల్లగొండకు హరీశ్‌రావు

- చండూర్, నల్లగొండలో రోడ్‌షో
- నల్లగొండలో ఏర్పాట్లు పరిశీలించిన మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల, కిశోర్

నల్లగొండ, మే 1 : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శుక్రవారం నల్లగొండ జిల్లాకు రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరుతూ చండూర్‌లో సాయంత్రం 5 గంటలకు రోడ్ షో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఆ తర్వాత సాయంత్రం 6 గంటలకు బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ నల్లగొండ జిల్లా కేంద్రంలో రోడ్ షో చేపట్టనున్నారు. హైదరాబాద్ రోడ్ వివేకానంద విగ్రహం నుంచి క్లాక్ టవర్ వరకు సాగనున్న రోడ్ షోలో హరీశ్‌రావు మాట్లాడనున్నారు. ఈ సందర్భంగా బుధవారం నల్లగొండలో ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, హుజూర్ నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి పరిశీలించారు. వారి వెంట నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాయకులు జమాల్ ఖాద్రి, వట్టిపల్లి శ్రీనివాస్, గంజి రాజేందర్ తదితరులు ఉన్నారు.



మాజీ మంత్రి హరీశ్‌రావు రోడ్‌షో సందర్భంగా నల్లగొండలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, మందడి సైదిరెడ్డి తదితరులు

# నేటి నుంచే మండలి నామినేషన్లు

## నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గానికి నోటిఫికేషన్

- నల్లగొండ కలెక్టర్ చాంబర్‌లో ఏర్పాట్లు
- ఉదయం 11 నుంచి మధ్యాహ్న 3గంటల వరకు స్వీకరణ

నల్లగొండ ప్రతినిధి, మే1(నమస్తే తెలంగాణ) : నల్లగొండ-ఖమ్మం-వరంగల్ శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం ఉపఎన్నికకు గురువారం నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం కూడా మొదలవుతుంది. మొత్తం 12 జిల్లాలతో కూడిన ఈ నియోజకవర్గంలో పోటీ చేయాలనుకునే అభ్యర్థులంతా నల్లగొండ కలెక్టరేట్‌లోనే తమ నామినేషన్లను సమర్పించాల్సి ఉంది. నల్లగొండ కలెక్టర్ హరిచందన ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. దాంతో నామినేషన్‌ను దాఖలు చేసే అభ్యర్థులు సెలవు దినాలు మినహా మిగతా అన్ని ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. నల్లగొండ కలెక్టర్ చాంబర్‌లో నామినేషన్ల స్వీకరణకు కావాల్సిన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశారు.

2021 మార్చిలో ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో తన శాసనమండలి సభ్యత్వ పదవికి గత డిసెంబర్‌లో రాజీనామా చేశారు. దీంతో 2027 మార్చి వరకు మిగిలిన పదవీకాలం కోసం ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నెల 25న కేంద్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేసింది. నేటి నుంచి లాంఛనంగా నామినేషన్ల స్వీకరణ మొదలుకానుంది. ఉదయం 11గంటలకు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ హరిచందన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఆ వెంటే నామినేషన్ల కూడా స్వీకరణను ప్రారంభం కానుంది. ఈ నియోజకవర్గం నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి, ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, వరంగల్ అర్బన్, రూరల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, జనగాం పూర్తి జిల్లాలతో పాటు సిద్దిపేట జిల్లాలోని మూడు మండలాలతో విస్తరించి ఉంది. ఈ నియోజకవర్గంలో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులంతా తమ నామినేషన్లను నల్లగొండ కలెక్టరేట్‌లోనే దాఖలు చేయాల్సి ఉంది. 10వ తేదీన నామినేషన్ల పరిశీలన అనంతరం 13వరకు ఉపసంహరణ గడువు విధించారు. అదే రోజు అభ్యర్థుల తుది జాబితా వెల్లడిస్తారు. ఈ నెల 27న పోలింగ్, జూన్ 5న ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 600 పోలింగ్ కేంద్రాలు ఉండగా 4.61లక్షల మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారు. ఇప్పటికే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న రంగంలోకి దిగగా బీఆర్ఎస్, బీజేపీల నుంచి ఒకట్రెండు రోజుల్లో స్పష్టత రావచ్చని సమాచారం. ఈ నెల 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ అనంతరం మండలి ఎన్నికలపై అన్ని పార్టీలు పూర్తి స్థాయిలో దృష్టి సారించే అవకాశాలు ఉన్నాయి.

# నిప్పుల కుంపటి

## 45.6 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

## బయటకు రావాలంటే జంకుతున్న ప్రజలు

భువనగిరి కలెక్టరేట్, మే1 : ఎండలు దంచికొడుతున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకుంటున్నాయి. జిల్లాలో బుధవారం అత్యధికంగా 45.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఉదయం 8గంటల నుంచే మొదలవుతున్న ఎండ వేడిమి మధ్యాహ్నం వరకు నిప్పుల కుంపటిగా మారుతున్నది. పది గంటలు దాటిందంటే ఇండ్ల నుంచి బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం 35 డిగ్రీలకుపైనే నమోదవుతున్నాయి. రాత్రి 9 గంటలైనా సెగ తగ్గడం లేదు. పలు ప్రాంతాల్లో జనం లేక రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉష్ణోగ్రతలకు ఏసీలు, కూలర్ల వినియోగం భారీగా పెరిగింది. ఎండ సెగకు తట్టుకోలేక చల్లదనం కోసం జనం వెతుకులాడుతున్నారు. వడదెబ్బ తగులకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితి అయితేనే బయటికి రావాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆత్మకూరు(ఎం)లో 45.6 డిగ్రీలు, యాదగిరిగుట్ట, అడ్డగూడూరు మండలాల్లో 45.5, వలిగొండలో 45.4, వలిగొండలో 42.9, మోత్కూరులో 44.6, ఆలేరులో 44.3, భువనగిరిలో 44.2, భూదాన్‌పోచంపల్లి, సంస్థాన్‌నారాయణపూర్, రామన్నపేట మండలాల్లో 44.1, గుండాలలో 44, చౌటుప్పల్‌లో 43.7, బీబీనగర్‌లో 43.4, బొమ్మలరామారంలో 43, రాజాపేటలో 42.9, తుర్కపల్లి(ఎం)లో 41.9డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఎండలో స్కూటీపై వెళ్తున్న మహిళ

# కార్మిక చట్టాలపై అవగాహన ఉండాలి

- సీనియర్ సివిల్‌జడ్జి మాధవీలత



మాట్లాడుతున్న ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి మాధవీలత

భువనగిరి అర్బన్, మే 1: కార్మిక చట్టాలు, కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని భువనగిరి కోర్టు ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవీలత అన్నారు. మేడేను పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో కార్మికులతో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. చట్టాలపై కార్మికులకు అవగాహన ఉంటేనే వాటిని వినియోగించుకునేందుకు అవకాశం ఉం టుందన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి.హరినాథ్ మాట్లాడుతూ కార్మిక శక్తి దేశ భవితకు పునాది అన్నారు. కార్మికులకు ఉచిత న్యాయ సేవలను ప్యానల్ న్యాయవాదుల వ్యవస్థ ద్వారా అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది నాగారం అంజయ్య మాట్లాడుతూ కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. డిప్యూటీ న్యాయ సహాయ న్యాయవాది జి.శంకర్ మాట్లాడుతూ కార్మికులకు అందే న్యాయ సాయం గురించి వివరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎస్.జైపాల్, సహాయ ప్రభుత్వ న్యాయవాది కేశవరెడ్డి, సీనియర్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

